

బస్సులన్నీ బహిరంగ సభకే

ఆర్టీసీ బస్సులన్నీ ఖమ్మంలో జరిగిన బీజేపీ బహిరంగ సభకే వెళ్లడంతో రోజువారీ ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. 8లో



సీఎంఓగా ఎవరొస్తారో?

కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా ఎవరిని నియమిస్తారోననే చర్చ కార్మికుల్లో జరుగుతోంది. 10లో

గరిష్టం / కనిష్టం
32° / 23°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి అర్చకులు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. క్యూలైన్ల ద్వారా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి సన్నిధిలో చిన్నారులకు అన్నప్రాశన వేడుకలు జరుపుకున్నారు. పలురువ భక్తులు పెద్దమ్మతల్లికి ఒడిబియ్యం, పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ ఎస్.రజనీకుమారి, ధర్మకర్తల మండలి చైర్మన్ మహిపతి రామలింగం, డైరెక్టర్లు చందుపట్ల శ్రీనివాసరెడ్డి, గంధం వెంగళరావు, సంకా వెంకటరామారావు పాల్గొన్నారు.

ప్రత్యేక క్యూలైన్ కౌంటర్‌తో ఇక్కట్లు

పెద్దమ్మతల్లి దర్శనం కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్ వద్ద టికెట్ కౌంటర్ కూడా ఉండడంతో భక్తులు ఆలయంలోనికి వెళ్లాలంటే ఇబ్బంది పడాల్సి వస్తోంది. టికెట్ కౌంటర్‌ను మరోచోట ఏర్పాటుచేయాలని భక్తులు కోరుతున్నారు.

అమ్మవారికి ఒడిబియ్యం

నలభై సంవత్సరాల తర్వాత అధిక శ్రావణమాసం రావడంతో అన్ని విధాలా మంచి జరగాలని కోరుతూ పాల్వంచ తిరుప్పావై గ్రూపు మహిళలు పెద్దమ్మతల్లికి ఒడిబియ్యం, సారె సమర్పించారు. డాక్టర్ పెండ్యాల రోజాలక్ష్మి, చలవాది రాజ్యలక్ష్మి, శ్రీలక్ష్మి, తాటికొండ స్వప్న, వంకధార ఇందిర, జూలూరి మణి, కొప్పారపు సౌజ, దీప్తి, విమల, హిమజ, జయశ్రీ, భారతి, అనూష, పెండ్యాల పద్మావతి, గౌరి, ఎస్.రమ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త పడండి

జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి బాలాజీ



వైద్యులతో మాట్లాడుతున్న బాలాజీ

చండ్రుగొండ : వ్యాధులు ప్రబలకుండా ముందుగానే జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బాలాజీ సూచించారు. మండలంలోని మహ్మద్‌నగర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆయన డీఎస్ఓ దుర్గతో కలిసి సందర్శించారు. గ్రామంలో పరిస్థితిపై డాక్టర్ కనకం తనుజాను అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య చర్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకట్‌ప్రకాష్, హెల్త్ సూపర్‌వైజర్లు ఎండీ ఇమాం, శ్రీనివాస్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక క్యాంపుల్లో 4,041 దరఖాస్తులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని శని, ఆది వారాల్లో జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో నిర్వహించినట్లు కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 1,095 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నూతన ఓటరు నమోదుకు 4,041, తొలగింపునకు 557, మార్పు చేర్పులకు 1820 దరఖాస్తులు వచ్చాయని వివరించారు. ఈ దరఖాస్తుల విచారణ ప్రక్రియ పూర్తి చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. అక్టోబర్ నాటికి 18 సంవత్సరాలు నిండే వారు ఇంకా ఎవరైనా ఉంటే ఓటరుగా నమోదు కావాలని సూచించారు. వచ్చిన దరఖాస్తులను విచారణ నిర్వహించి ఎన్నికల పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. వచ్చే నెల 2, 3 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక క్యాంపులపై ప్రతి ఒక్కరికీ సమాచారం చేరాలని అధికారులను ఆదేశించారు.

రాష్ట్రస్థాయి హాకీ జట్టుకు ఎంపిక

దమ్మపేట: మండలంలోని అంకంపాలెం బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి హాకీ జట్టుకు ఎంపికయ్యారు. ఆదివారం కొత్తగూడెంలో నిర్వహించిన జిల్లాస్థాయి హాకీ పోటీల్లో ఈ పాఠశాల విద్యార్థినులు ఎడుగురు పాల్గొనగా, లావణ్య, స్పందన ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరిని హెచ్ఎం తొలెం వెంకటేశ్వర్లు, పీడీ నాగేంద్రమ్మ, ఉపాధ్యాయులు రవి, వాణి అభినందించారు.

అమిత్ షో !



సభకు హాజరైన నాయకులు, కార్యకర్తలు (ఇన్‌సెట్) 'రైతు గోస-బీజేపీ భరోసా' సభలో మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా

- ఉమ్మడి జిల్లా కేంద్రంగా హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రసంగం
- భద్రాద్రి రాముడు, ఉద్యమకారుల స్మరణ
- ఉమ్మడి ఖమ్మం, పరిసర జిల్లాల నుంచి తరలివచ్చిన బీజేపీ శ్రేణులు
- కమల దళాల్లో 'భరోసా' కదనోత్సాహం



సభా వేదికపై అభివాదం చేస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, పక్కన కిషన్‌రెడ్డి, బండి సంజయ్, తరుణ్ చుగ్, ఈటల రాజేందర్, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, డీ.కే.అరుణ, రఘునందన్‌రావు, బూర నర్సయ్య, కొండపల్లి శ్రీధర్‌రెడ్డి తదితరులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: కేంద్ర హోంమంత్రి, పార్టీ అగ్రనేత అమిత్‌షా ఖమ్మం పర్యటన కమలం శ్రేణుల్లో కదనోత్సాహాన్ని నింపింది. పార్టీ అగ్రనేత, అదీ కేంద్ర హోంమంత్రి స్థాయిలో ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేసిన పార్టీ సభలో ప్రసంగించడం బీజేపీ చరిత్రలోనే ఇదే ప్రథమం. దీంతో పార్టీ నేతలు ఉమ్మడి ఖమ్మంతోపాటు పరిసర జిల్లాల నుంచి పార్టీ శ్రేణులను 'రైతుగోస- బీజేపీ భరోసా' పేరుతో ఏర్పాటు చేసిన సభకు తరలించారు. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రి రాముడితోపాటు జిల్లాకు చెందిన తెలంగాణ ఉద్యమకారులు, స్వాతంత్ర్య సమరయోధులను స్మరిస్తూ షా ప్రసంగం కొనసాగింది. ఎన్నికల వేళ అమిత్‌షాతోపాటు పార్టీ ముఖ్యనేతలు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఈటల రాజేందర్ చేసిన ప్రసంగాలు పార్టీ కేడర్‌లో ఉత్సాహాన్ని నింపాయి.

రజాకార్లకు ఎదురొడ్డిన కేశవరావు

స్వాతంత్ర్య సంగ్రామం, నిజాం పాలనలో ఖమ్మానికి చెందిన జమలాపురం కేశవరావు రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఎదురొడ్డి పోరాడారని.. ఆయనకు నివాళులర్పిస్తున్నానని అమిత్‌షా ప్రసంగంలో చెప్పుకొచ్చారు. అలాగే రజాకార్ల దాష్టీకాలకు తెలంగాణ సమాజం తిరగబడిందని, మరోమారు నాటి రజాకార్ల పార్టీ ఎంఐఎంతో అంటకాగుతున్న కేసీఆర్‌కు కూడా ఇదే తిరుగుబాటు తప్పదని ఖమ్మం వేదికగా హెచ్చరిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే కేంద్ర మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్, రాష్ట్ర ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ సైతం తమ ప్రసంగాల్లో ఖమ్మం చైతన్య గడ్డ అని, రైతుగోస-బీజేపీ భరోసా వేదికగానే కేసీఆర్ పీఠం కదులుతుందని వెల్లడించారు. కేసీఆర్ దొంగ దీక్షను ఖమ్మం ప్రజలు బయటపెట్టారంటూ విమర్శలు చేశారు.

కదలివచ్చిన కమలదళం

'రైతు గోస-బీజేపీ భరోసా' సభకు ఉమ్మడి జిల్లాతోపాటు పరిసర జిల్లాల నుంచి శ్రేణులు కదిలివచ్చాయి. జన సమీకరణపై బీజేపీ నేతలు వారం రోజులుగా కసరత్తు చేశారు. తొలుత కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఖమ్మం వచ్చి ఎస్ఆర్ అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల మైదానాన్ని పరిశీలించడంతోపాటు నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఆ తర్వాత రాష్ట్ర నేతలు ఖమ్మం వచ్చి సభా ఏర్పాట్లు, జన సమీకరణపై దృష్టి సారించారు. ఈటల రాజేందర్ రెండు రోజులపాటు ఖమ్మంలోనే ఉండి నేతలకు సూచనలు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా స్థానిక నేతలు జన సమీకరణపై దృష్టి పెట్టారు. వెయ్యి ఆర్టీసీ బస్సులతోపాటు ప్రైవేట్ వాహనాలను కూడా జనాన్ని తరలించేందుకు ఉపయోగించారు. మధ్యాహ్నం 12గంటల నుంచి ఉమ్మడి జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాల నుంచి జనం సభకు తరలివచ్చారు.

రెండు గంటలకు పైగా ఖమ్మంలో...

షెడ్యూల్ ప్రకారమే అమిత్‌షా పర్యటన సాగింది. ఆయన సీఆర్‌పీఎఫ్ హెలికాప్టర్‌లో గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి ఖమ్మానికి చేరుకున్నారు. సర్దార్ పటేల్ స్టేడియంలో సాయంత్రం 3.35 గంటలకు హెలికాప్టర్ ల్యాండ్ కాగా.. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఆయన ఇల్లెందు క్రాస్‌రోడ్డులోని ఎన్నెస్పీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుని కాసేపు విశ్రాంతి తీసుకుని.. సాయంత్రం 4.20 గంటలకు వేదిక వద్దకు చేరుకున్నారు. ఆ తర్వాత సాయంత్రం 4.53 గంటల నుంచి 5.22 వరకు సుమారు అరగంట ప్రసంగించారు. అమిత్‌షా, ముఖ్యనేతలు ప్రసంగం చేస్తున్నంతసేపు జై శ్రీరామ్, బీజేపీ జిందాబాద్ నినాదాలు మార్మోగాయి. సభ ముగిశాక వేదిక వెనుక గ్రీన్‌రూమ్‌లో పార్టీ కోర్ కమిటీ సమావేశంలో పాల్గొన్న షా.. సాయంత్రం 5.56 గంటలకు హెలికాప్టర్‌లో గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరారు. ఈ సభలో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జాతీయ ఉపాధ్యక్షురాలు డీ.కే.అరుణ, జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్, ఎంపీ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్, రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి తరుణ్‌చుగ్, సహ ఇన్‌చార్జి సునీల్ బన్సల్, మరో ఇన్‌చార్జి ప్రకాష్ జవదేకర్, ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే రఘునందన్‌రావు, తమిళనాడు రాష్ట్ర సహ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు గరికపాటి మోహన్‌రావు, కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, ఉప్పల శారద, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, గెంటెల విద్యాసాగర్, కుంజా సత్యవతి, ఊకె అబ్బయ్య, విజయరామారావు, జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, దేవకి వాసుదేవరావు, సన్నె ఉదయ్‌ప్రతాప్, రుద్ర ప్రదీప్, డాక్టర్ శీలం పాపారావు తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మలతో సభకు వచ్చిన మహిళా కార్యకర్తలు

అటు భద్రాద్రి.. ఇటు స్తంభాద్రి

అమిత్‌షా ప్రసంగంలో భద్రాద్రి శ్రీసీతారామచంద్ర స్వామి, ఖమ్మంలోని స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామిని తలుచుకున్నారు. తొలుత తిరుమల వెంకన్న, ఆ తర్వాత ఖమ్మంలో స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులతో తెలంగాణలో, ఖమ్మంలో అడుగు పెట్టానని ఆయన ప్రసంగం ఆరంభించారు. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రి రాముడికి అనాదిగా పట్టువస్త్రాలను పాలకులు సమర్పిస్తారని, ఆ సంప్రదాయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ విస్మరించారని విమర్శలు ఎక్కుపెట్టారు. ఎంఐఎం అధినేత ఒవైసీ చేతిలో కేసీఆర్ కారు స్టీరింగ్ ఉండటంతోనే భద్రాద్రి రాముడిని కేసీఆర్ పట్టించుకోవడం లేదంటూ విమర్శలు గుప్పించారు. బీజేపీ అధికారంలోకి వస్తే భద్రాద్రి రాముడి పాదపద్మాల వద్ద తమ పార్టీ ముఖ్యమంత్రి కమల పుష్పాలు పెడతారని, పట్టువస్త్రాలు సమర్పిస్తారని పేర్కొన్నారు. దీంతో పాటు ఆయన ప్రసంగంలో జై శ్రీరామ్, జైజై శ్రీరామ్ అంటూ నినాదాలు కూడా చేశారు.

బ్లాక్ కాఫీ మాత్రమే..

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలో జరిగిన రైతు గోస-బీజేపీ భరోసా సభకు హాజరైన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా హెలికాప్టర్‌లో సర్దార్‌పటేల్ స్టేడియానికి చేరుకున్నారు. అక్కడి నుంచి ఎన్ఎస్‌పీ గెస్ట్ హౌస్‌కు వెళ్లి ఫ్రెష్ అయ్యాక మళ్లీ సభా వేదిక వద్దకు వచ్చారు. సభ అనంతరం వేదిక వెనుక ఏర్పాటుచేసిన గ్రీన్‌రూమ్‌కు వెళ్లిన అమిత్‌షాకు స్నాక్స్‌గా బాదం, పిస్తా, జీడిపప్పుతో పాటు కాఫీ ఏర్పాటుచేశారు. అయితే, ఆయన తినుబండారాలు ఏమీ తీసుకోకుండా బ్లాక్ కాఫీ మాత్రం తాగారు. పది నిమిషాల పాటు గ్రీన్ రూమ్‌లో గడిపాక హెలిప్యాడ్‌కు వచ్చారు.

సభ సాగిందిలా..

- **మధ్యాహ్నం 3.10 గంటలు :** వేదికపై నాయకుల ప్రసంగాలు ప్రారంభమయ్యాయి.
- **3.33 గంటలు :** హోంమంత్రి అమిత్‌షా వచ్చిన బీఎస్ఎఫ్ హెలికాప్టర్ పటేల్ స్టేడియంలో ల్యాండ్ అయింది. అక్కడే గ్రీన్ రూమ్‌లో అమిత్‌షా కాసేపు గడిపారు.
- **సాయంత్రం 4.22 గంటలు :** హోంమంత్రి అమిత్‌షా వేదికపైకి రాగా నాయకులు స్వాగతం పలికారు. గజమాలతో సత్కరించి జ్ఞాపికగా అందజేశారు. అనంతరం అమిత్‌షా విల్లు ఎక్కుపెట్టగా, గింజుపల్లి విశ్వనాథం నాగలి అందజేశారు.
- **4.29 గంటలు :** కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ప్రసంగం ప్రారంభించి 4.43 గంటలకు ముగించారు. అనంతరం బండి సంజయ్ మాట్లాడారు.
- **4.53 గంటలు :** అమిత్‌షా ప్రసంగం ప్రారంభించేందుకు మైకు వద్దకు రాగా.. మైక్ మొరాయించడంతో నిమిషం పాటు వేచి ఉన్నారు.
- **4.54 గంటలు :** అమిత్‌షా ప్రసంగం ప్రారంభించి 5.22 గంటలకు ముగించారు. ఆయన హిందీలో ప్రసంగించగా.. రాజ్య సభ సభ్యుడు లక్ష్మణ్ అనువదించారు.
- **5.23 గంటలు :** అమిత్‌షా వేదిక దిగి వెళ్లారు.
- **సాయంత్రం 5.50 గంటలకు** హెలిప్యాడ్‌కు చేరుకోగా, 5.54 గంటలకు హెలికాప్టర్ గాల్లోకి ఎగిరింది.

– ఖమ్మం మయూరిసెంటర్

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

అదనపు కలెక్టర్ పర్సా రాంబాబు

అశ్వారావుపేటరూరల్/దమ్మపేట : పోలింగ్ కేంద్రాల్లో సరైన సౌకర్యాలు కల్పించాలని అదనపు కలెక్టర్ పర్సా రాంబాబు సిబ్బందిని ఆదేశించారు. అశ్వారావుపేట మండలం అచ్యుతాపురం, దమ్మపేట పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఆయన పరిశీలించారు. అచ్యుతాపురంలో ర్యాంప్ శిథిలమైనందున పునరుద్ధరించాలని తహసీల్దార్ కృష్ణప్రసాద్‌కు సూచించారు. సౌకర్యాలు లేని కేంద్రాలను గుర్తించి తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు. ఓటర్ల జాబితాలో సవరణలపై బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. చనిపోయిన వారి వివరాలు సేకరించి, ఓటర్ల జాబితా నుంచి తొలగించాలన్నారు. రెండు రోజులుగా సాగుతున్న ప్రత్యేక ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పుల ప్రక్రియకు అనూహ్య స్పందన వచ్చిందన్నారు. ఆయా కార్యక్రమాల్లో దమ్మపేట తహసీల్దార్ ముజాహిద్, డిప్యూటీ తహసీల్దార్ భావన, ఎంఈఓ కీసర లక్ష్మి, అశ్వారావుపేట కార్యాలయ సూపరింటెండెంట్ ప్రభాకర్, బీఎల్‌ఓ శాంతి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా అగ్ని ప్రతిష్ఠ



అగ్నిప్రతిష్ఠ నిర్వహిస్తున్న అర్చకులు



రూ.10 లక్షల విరాళం అందించిన దాతలకు రశీదు ఇస్తున్న ఆలయ ఈఓ రమాదేవి

రామాలయంలో కొనసాగుతున్న పవిత్రోత్సవాలు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో శ్రావణ మాసంలో జరిగే పవిత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. యాగశాలలో అగ్నిప్రతిష్ఠ, అష్టోత్తర శత కలశావాహనం, పవిత్రాధివాసం, హవనం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం 108 కలశాలతో స్వామివారికి స్నపన తిరుమంజనం, పూర్ణాహుతి, పవిత్రారోపణము తదితర పూజలు చేయనున్నారు. కాగా, భక్తులు సమర్పించిన రామకోటి పుస్తకాలను సోమవారం పవిత్ర గోదావరిలో నిమజ్జనం చేస్తామని ఆలయ ఈఓ ఎల్. రమాదేవి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ సాయిబాబు, డోలు విద్వాంసుడు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళాల వెల్లువ

శ్రీ సీతారామచంద్రస్వామి వారి సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఆదివారం విరాళాలు వెల్లువెత్తాయి. ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రికి చెందిన డీఎస్ఎం లక్ష్మి రూ.10 లక్షలు, గరుడా నాగేంద్ర వరప్రసాద్ – శాంతిశ్రీ దంపతులు రూ.1,00,002, హైదరాబాద్ సరూర్ నగర్‌కు చెందిన సుబ్రహ్మణ్యం రూ.లక్ష, సికింద్రాబాద్ రామచంద్రన్ కాలనీకి చెందిన నందూరి సీతారామయ్య రూ.లక్ష వితరణగా అందజేశారు. కాగా, రామాలయంలో డోలు విద్వాంసుడిగా పనిచేసి, గత నెలలో ఉద్యోగ విరమణ పొందిన మున్నంగి నాగేశ్వరరావు తన తొలి పింఛన్ రూ.70,101 నిత్యాన్నదాన కార్యక్రమానికి వితరణగా అందించారు.

ఏళ్ల కల సాకారం..

- నేడు ఇల్లెందు శాటిలైట్ బస్ డిపో ప్రారంభం
- ఇప్పటికే బస్సులు, ఉద్యోగుల కేటాయింపు
- పట్టుబట్టిన హరిప్రియ.. హామీ అమలు చేసిన పువ్వాడ





డిపోలో ఏర్పాటు చేసిన సభా వేదిక (ఇన్‌సెట్) బస్సుపై ఇల్లెందు డిపోను సూచిస్తున్న దృశ్యం

ఇల్లెందు: ఎట్టకేలకు ఇల్లెందులో బస్‌డిపో ప్రారంభం కాబోతోంది. బస్‌డిపో కోసం స్థానిక ఎమ్మెల్యే హరిప్రియ పలుమార్లు కోరగా, రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సానుకూలంగా స్పందించి డిపో ఏర్పాటుకు 2018 అక్టోబర్‌లో ఆదేశాలు జారీ చేశారు. డిపో నిర్మాణానికి అప్పటి కలెక్టర్ ఎంవీ రెడ్డి డీఎంఎఫ్ నుంచి రూ. 3.75 కోట్ల నిధులు మంజూరు చేశారు. నాటి నుంచి బస్‌డిపో ఎప్పుడు పూర్తవుతుందోనని ఈ ప్రాంత వాసులు ఎదురుచూడగా, సోమవారం ఆ కల సాకారం కానుంది. శాటిలైట్ డిపో ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలని ఆర్టీసీ, మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే హరిప్రియ సూచించారు. దీంతో కొత్తగూడెం డిపో మేనేజర్ బి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పైలాన్, శిలాఫలకం ఏర్పాటు, డిపో లోపల సభా వేదిక నిర్మాణం తదితర ఏర్పాట్లు చేస్తున్నారు. డిపోను సుందరంగా తీర్చిదిద్దే పనులు కూడా సాగుతున్నాయి.

బస్‌డిపోతో కోలాహలం..

ఇల్లెందులో బస్‌డిపో ప్రారంభం కానుండడంతో పట్టణ ప్రజల్లో హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి. బస్ డిపో ఏర్పాటు చేయాలంటూ గత మున్సిపల్ ఎన్నికల ముందు పలుమార్లు ఇల్లెందుకు వచ్చిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను ఎమ్మెల్యే హరిప్రియ పలు సభల్లో పదే పదే వేడుకోగా, బస్‌డిపో మంజూరు చేసి చెల్లెమ్మ ఆకాంక్షను నెరవేరుస్తానని పువ్వాడ ప్రకటించారు. ఆయన ఆదేశాల మేరకు శాటిలైట్ బస్‌డిపో ఏర్పాటుకు అనువైన వాతావరణం, అంచనా వ్యయం తదితర వివరాలను అధికారులు రూపొందించారు. శాటిలైట్ బస్‌డిపో ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించాలని 2018 జూలై 26న ఈడీ నుంచి ఆర్ఎంకు ఆదేశాలు వచ్చాయి. దీంతో ఆర్ఎం అంచనాలు సిద్ధం చేసి ఈడీకి నివేదిక అందించగా రూ.3.75 కోట్లు కేటాయిస్తూ నాటి కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

24 బస్సుల కేటాయింపు..

ఇల్లెందు కేంద్రంగా ప్రారంభం కాబోతున్న శాటిలైట్ బస్ డిపోకు ప్రస్తుతం 24 బస్సులు కేటాయించగా, కొత్తగూడెం డిపో నుంచి 14, ఖమ్మం డిపో నుంచి 10 బస్సులు ఇల్లెందుకు చేరుకున్నాయి. ఈ డిపోలో 24 బస్సులకు గాను 63 మంది డ్రైవర్లు, 63 మంది కండక్టర్లు, 30 మంది మెకానిక్‌లు, 8 మంది ట్రాఫిక్ సూపర్‌వైజర్లు, ఐదుగురు సెక్యూర్టీ గార్డులు.. మొత్తం 169 మంది పని చేయనున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని డిపోల్లో పని చేసే ఉద్యోగులకు ఇల్లెందులో పని చేసేందుకు అవకాశం కల్పించారు. ముందస్తుగా వారి నుంచి అనుమతి పత్రం తీసుకుని మెరిట్ ఆధారంగా పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు.

పెట్రోల్ బంక్ నిర్మాణంలో జాప్యం..

ఇల్లెందు బస్‌డిపోకు అనుబంధంగా పెట్రోల్ బంక్ నిర్మించాల్సి ఉంది. ఈ బంక్‌ను మల్టీపర్పస్‌గా ఉపయోగంలోకి వచ్చేలా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. బస్టాండ్ ఆవరణలోని ఖాళీ స్థలంలో నిర్మిస్తే ఇటు ప్రజలకు, అటు ఆర్టీసీకి ఉపయోగపడుతుందని అధికారులు భావిస్తున్నారు. కాగా, పెట్రోల్ బంక్ నిర్మాణానికి ఇంకా అనుమతి రాలేదని, అందువల్లే నిర్మాణంలో జాప్యం జరుగుతోందని చెబుతున్నారు.

బస్సుపై 'ఇల్లెందు' కనిపించాలి



ఇక్కడి బస్సుల మీద 'ఇల్లెందు' డిపో అనే అక్షరాలు కనిపించాలన్నదే నా చిరకాల వాంఛ. నా హయాంలో బస్‌డిపో ప్రారంభం కాబోతుండడం సంతోషంగా ఉంది. మొదట బస్ డిపో ఏర్పాటుపై నేను మాట్లాడినప్పుడు ఇది సాధ్యమేనా అనే సందేహాలను చాలా మంది వ్యక్తం చేశారు. అయితే మంత్రులు అజయ్‌కుమార్, కేటీఆర్, సీఎం కేసీఆర్ మాట ఇచ్చారు. వారు ఇచ్చిన మాట నిలుపుకుంటారు అనడానికి ఇదే నిదర్శనం. బస్‌డిపో ఏర్పాటుతో ఈ ప్రాంత వాసుల ఆరవై ఏళ్ల కళ నెరవేరనుంది.

– హరిప్రియ, ఇల్లెందు ఎమ్మెల్యే

క్లుప్తంగా

ముత్యాలమ్మ తల్లికి బంగారు కళ్లు



అమ్మవారికి బంగారు కళ్లు అందజేస్తున్న దంపతులు

బూర్గంపాడు: సారపాక ముత్యాలమ్మపేటలోని అమ్మవారికి ఆదివారం ఉప్పెర్ల జగన్, అర్చన దంపతులు రూ.25 వేలు విలువ చేసే బంగారు కళ్లు సమర్పించారు. శ్రావణమాస బోనాల సందర్భంగా అమ్మవారికి ఈ కళ్లను అలంకరించారు. కార్యక్రమంలో దాతల కుటుంబసభ్యులు, ఆలయ నిర్వహణ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజుకు జాతీయ సేవారత్న పురస్కారం



పురస్కారం అందుకుంటున్న రాజు

జూలూరుపాడు: సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందు నిలుస్తున్న జూలూరుపాడుకు చెందిన ఇడుపుల రాజుకు జాతీయ సేవా రత్న పురస్కారం లభించింది. కేబీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఏపీలోని గుంటూరులో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయనకు ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ మంత్రి మేకపాటి సుచరిత, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్‌రావు తదితరులు ఆయనకు పురస్కారం అందజేసి సన్మానించారు.


కిన్నెరసానిలో సందడి సందడిగా..



బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: మండలంలోని పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానికి ఆదివారం జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి పర్యాటకులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. డ్యాం పైనుంచి జలాశయాన్ని, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. అలాగే, కిన్నెరసాని జలాశయంలో బోటు షికారు చేశారు. పర్యాటకుల ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.10,925, బోటు టికెట్లతో టూరిజం కార్పొరేషన్‌కు రూ.6,370 ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు.

కిన్నెరసాని ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తివేత



ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తిన దృశ్యం

పాల్వంచరూరల్: ఎగువన కురిసిన భారీ వర్షాలకు కిన్నెరసాని జలాశయంలోకి వరద వస్తుండటంతో ప్రాజెక్టుకు చెందిన రెండు గేట్లను ఆదివారం ఎత్తారు. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన కిన్నెరసాని జలాశయంలోకి 4 వేల క్యూసెక్కుల వరద రాగా రిజర్వాయర్ నీటిమట్టం 405 అడుగులకు పెరిగింది. దీంతో రెండు గేట్లను రాత్రి సమయంలో ఎత్తివేసి 4 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు డ్యామ్ సైడ్ పర్యవేక్షక ఇంజనీర్ తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాగు పరిసరాల వైపునకు వెళ్లొద్దని సూచించారు.

పెరుగుతున్న పెదవాగు నీటిమట్టం



16.2 అడుగులకు చేరిన నీటి మట్టం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి వద్దగల పెదవాగు ప్రాజెక్ట్ నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లోని వాగుల నుంచి వరదనీరు పోటెత్తుతోంది. దాంతో మొన్నటి వరకు 14 అడుగుల మేర ఉన్న పెదవాగు ప్రాజెక్టు నీటి మట్టం ఆదివారం సాయంత్రానికి 16.2 అడుగులకు చేరింది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి ఇంకా ఇన్‌ఫ్లో వస్తోందని, రాత్రికి మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్లు ప్రాజెక్టు ఏఈఈ కేఎస్‌టీ కృష్ణ తెలిపారు. ప్రాజెక్టులో వరదనీరు భారీగా చేరడంతో కళకళలాడుతోంది. దాంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,091





మైదానంలో పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్‌చుగ్, సభా వేదిక పైనుంచి వెళ్తున్న హెలికాప్టర్



సభకు వస్తున్న ప్రజలు



సభా ప్రాంగణంలో బీజేపీ జెండాతో కార్యకర్త



అమిత్‌షాను గజమాలతో సత్కరిస్తున్న జిల్లా నాయకులు



ఖమ్మం.. కాషాయమయం!



అమిత్‌షాకు నాగలి అందజేస్తున్న కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

ఖమ్మంలో ఆదివారం 'రైతు గోస.. బీజేపీ భరోసా' పేరిట నిర్వహించిన సభకు పార్టీ శ్రేణులతోపాటు ప్రజలు భారీగా హాజరయ్యారు. బీజేపీ జెండాలు, ఫ్లెక్సీలతో జిల్లా కేంద్రంతో పాటు సభ జరిగిన కళాశాల ఆవరణ కాషాయమయం అయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బస్సులు, ఇతర వాహనాలు సమకూర్చడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు ఎస్‌ఆర్‌అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాలలో జరిగిన సభకు తరలివచ్చారు. ఓ పక్క సభ మొదలయ్యాక కూడా వాహనాలు వస్తుండడం కనిపించింది. పార్టీ నాయకులు మాట్లాడుతున్నంత సేపు కార్యకర్తలు జై శ్రీరామ్.. జై బీజేపీ అంటూ నినాదాలు చేయడంతో సభాస్థలి మార్మోగింది. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్



బీజేపీ ప్లకార్డులతో వస్తున్న కార్యకర్తలు



సభావేదిక వద్ద జెండాలు విక్రయిస్తున్న వ్యాపారి



వేదికపై ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

కట్టుదిట్టమైన భద్రత

బందోబస్తులో మూడు జిల్లాల పోలీసులు



మెటల్ డిటెక్టర్ ద్వారా తనిఖీ చేస్తున్న పోలీసులు

ఖమ్మంక్రైం: కేంద్ర హోం మంత్రి అమిత్‌షా జిల్లా పర్యటన కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సాఫీగా ముగిసింది. మూడు రోజులుగా సీఆర్పీఎఫ్ బలగాలు ఖమ్మంలో పర్యవేక్షిస్తుండగా ఆదివారం నాటి బందోబస్తులో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన సుమారు 800 మంది పోలీసులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో స్టేడియం

విజయవాడ నుంచి అమిత్‌షాకు ప్రత్యేక హెలికాప్టర్‌లో ఖమ్మం చేరుకుని సర్దార్ పటేల్ స్టేడియంలోని హెలిప్యాడ్‌లో దిగారు. దీంతో ఉదయం నుంచే స్టేడియాన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీపీ విష్ణు ఎస్.వారియర్ ఆధ్వర్యాన స్టేడియంలోకి రెండు వైపుల నుంచీ ఎవరినీ అనుమతించలేదు. అమిత్‌షా హెలికాప్టర్ దిగాక కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ వారియర్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ప్రత్యేక వాహనాల్లో స్టేడియంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలోకి వచ్చే ప్రత్యేక గేట్ ద్వారా సభావేదికపైకి వెళ్లిన అమిత్‌షా తిరిగి అదే గేట్ నుంచి హెలిప్యాడ్‌కు వచ్చారు. అమిత్‌షా మాట్లాడే సమయాన స్టేజీ వద్ద ఏఆర్ బలగాలు మోహరించాయి. సీఆర్పీఎఫ్ ఉన్నతాధికారి ఎప్పటికప్పుడు సీపీ వారియర్‌తో బందోబస్తుపై సమీక్షించారు. ఇక కళాశాల ఆవరణతో పాటు హెలిప్యాడ్ వద్ద అగ్నిమాపకశాఖ వాహనాలను అందుబాటులో ఉంచారు. కళాశాల ముందు భాగంలో వీవీఐపీల కోసం ద్వారం ఏర్పాటుచేసి ఇతరులను కట్టడి చేసినా ఆ తర్వాత పోలీసులు వదిలేయడంతో మీడియా గ్యాలరీలోకి బీజేపీ కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. ప్రొటోకాల్ మేరకు అమిత్‌షాను కలిసిన వారితో పాటు స్టేజీపై కూర్చునే వారి పేర్లతో జాబితా తయారుచేసి వారిని మాత్రమే అనుమతించారు.

బస్సులన్నీ బహిరంగ సభకే..

ఇబ్బందులు పడిన ప్రయాణికులు



బస్సు ఎక్కేందుకు పోటీ పడుతున్న ప్రయాణికులు

చుంచుపల్లి: ఖమ్మంలో భాజపా బహిరంగ సభ వల్ల ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు ఆదివారం ఉదయం నుంచే ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఖమ్మంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా బహిరంగ సభ నేపథ్యంలో జిల్లాలోని మూడు డిపోల పరిధిలోని 60 శాతం బస్సులను ఆర్టీసీ అధికారులు కేటాయించారు. మొత్తం 233 బస్సుల్లో 100 బస్సులను ఖమ్మం బహిరంగ సభకు పార్టీ శ్రేణులు ఒప్పందం చేసుకున్నాయి. ఇందులో కొత్తగూడెం డిపో నుంచి అత్యధికంగా 46 సర్వీసులు, మణుగూరు నుంచి 30 బస్సులు, భద్రాచలం నుంచి 24 బస్సులు ఉన్నాయి. ఇక సూపర్ లగ్జరీ సర్వీసులతో పాటు మరికొన్ని ఎక్స్‌ప్రెస్‌లు తప్ప మిగతా ఇతర బస్సులన్నీ ఖమ్మం సభకు వెళ్లాయి. దీంతో భద్రాచలం, మణుగూరు, పాల్వంచ, కొత్తగూడెం, ఇల్లెందు, హైదరాబాద్, ఖమ్మం తదితర రూట్లకు బస్సుల కొరత ఏర్పడింది. దీంతో జిల్లా నుంచి పలు ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ ప్రయాణికులకు బస్టాండ్లలో నిరీక్షణ తప్పలేదు. కొందరు కుటుంబ సమేతంగా, మరి కొందరు చంటి పిల్లలతో బస్సుల కోసం ఎదురుచూస్తూ కనిపించారు. ఒకటి అర బస్సులు రావడంతో వాటికోసం ప్రయాణికులు పోటీపడాల్సి వచ్చింది. నడిచిన కొన్ని సర్వీసులు కూడా ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. ముఖ్యంగా జిల్లా నుంచి హైదరాబాద్, ఖమ్మం, నల్లగొండ తదితర రూట్లకు వెళ్లాల్సిన ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మూడు డిపోల పరిధిలో మారుమూల గ్రామాలకు నడిచే రెగ్యులర్ పల్లెవెలుగు సర్వీసులను కూడా రద్దు చేశారు. డిపోల పరిధిలో ఉన్న కేవలం సూపర్ లగ్జరీ బస్సులను మాత్రమే అధికారులు హైదరాబాద్, విజయవాడ, వరంగల్ రూట్లకు నడిపించారు. ఖమ్మం బీజేపీ బహిరంగ సభకు కొత్తగూడెం డిపో నుంచి ఒక్కొక్క బస్సుకు రూ.22 వేల చొప్పున, మణుగూరు, భద్రాచలం డిపోలకు దూరాన్ని బట్టి రూ.25 వేల చొప్పున కేటాయించారు. ఆర్టీసీకి రూ.21 లక్షల వరకు ఆదాయం సమకూరనుందని అధికారులు తెలిపారు.

ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్య

పాల్వంచ: ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని టీచర్స్‌కాలనీలో నివాసం ఉంటున్న బీటీపీఎస్ సబ్ ఇంజనీర్ తెల్లగొండ రామకృష్ణ భార్య ప్రశాంతి (36) ఆదివారం సాయంత్రం బెడ్‌రూంలో చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. 2009లో వారికి వివాహం కాగా ఇద్దరు కుమారులున్నారు. అదనపు కట్నం కోసం భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. మృతురాలి తల్లి గరిడపల్లి సత్యవతి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ బి.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పదవికి రాజీనామా

దుమ్ముగూడెం: మండలంలోని సీతానగరం గ్రామానికి చెందిన తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ కాంగ్రెస్ స్టేట్ కోఆర్డినేటర్ తెల్లం నరేశ్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్‌గా ఆదివాసీ జాతికి చెందిన ఉబ్బా వేణుకు కొన్ని రోజుల కిందట నియామకపత్రం అందజేశారని, తిరిగి కొన్ని రోజులకే లంబాడా సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని చైర్మన్‌గా నియమించారని, అందుకు నిరసనగా తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాజీనామా పత్రాన్ని తెలంగాణ ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తేజావత్ చెల్లయ్యనాయక్‌కు పంపించానని వివరించారు.

కుక్కలు వెంబడించడంతో బైక్ బోల్తా

ఇద్దరికి గాయాలు



తీవ్ర గాయాలతో మరియమ్మ

పినపాక: కుక్కలు వెంబడించడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి పడిపోగా దానిపై ఉన్న ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మణుగూరు మండలానికి చెందిన దేవరాజు, మరియమ్మ ద్విచక్రవాహనంపై ఈ–బయ్యారం వస్తున్న క్రమంలో పోతిరెడ్డిపల్లి గ్రామం వద్ద కుక్కలు వెంబడించాయి. దీంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి పడిపోయింది. దేవరాజుకు చెయ్యి విరగగా మరియమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో ఆపరేటర్ మృతి



రమేశ్ (ఫైల్)

పినపాక: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుదాఘాతానికి గురై ఆపరేటర్ మృతి చెందిన ఘటన ఈ–బయ్యారం సబ్‌స్టేషన్‌లో ఆదివారం చోటుచేసుకుంది. తోటి ఉద్యోగుల కథనం ప్రకారం.. కొత్తపల్లి రమేశ్ (37) సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం సబ్‌స్టేషన్‌లో ఫీడర్ ఆన్ చేస్తుండగా ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై కుప్పకూలిపోయాడు. గమనించిన ఉద్యోగులు వెంటనే మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. రమేశ్ మృతి పట్ల విద్యుత్ శాఖ ఉద్యోగులు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

40 లీటర్ల సారా స్వాధీనం



అధికారులు స్వాధీనం చేసుకున్న నాటుసారా, ద్విచక్రవాహనం

చర్ల: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం తెల్లవారుజామున ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. నాటుసారా విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మండలంలోని పెదమిడిసిలేరు, ఆంజనేయపురం, కలివేరు, సత్యనారాయణపురం, చర్ల, ఆర్.కొత్తగూడెం తదితర గ్రామాల్లో సారా విక్రేతల ఇళ్లపై దాడులు నిర్వహించారు. ఇదే సమయంలో ద్విచక్రవాహనంపై నాటుసారా తీసుకొస్తున్న గుర్తుతెలియని వ్యక్తి ఎక్సైజ్ అధికారులను గమనించి ద్విచక్రవాహనాన్ని విడిచిపెట్టి పారిపోయాడు. ఆ ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని, దొరికిన 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

కేసులు నమోదు

భద్రాచలంఅర్బన్: పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై మరో ముగ్గురు వ్యక్తులు దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దాడిచేసినవారిపై కేసు నమోదు చేశారు. పట్టణంలోని ఏఎంఆర్ సినిమా హాల్ సమీపంలో మనుబోతులచెరువుకు చెందిన రాజమండ్రి దుర్గాప్రసాద్‌పై రాజమండ్రి రాజేశ్, సతీశ్, శంకర్ దాడి చేశారు. పాత కక్షలతోనే తనపై దాడి చేశారని దుర్గాప్రసాద్ ఫిర్యాదు చేయగా ఆ ముగ్గురిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ మధుప్రసాద్ తెలిపారు.

వేధింపులపై..

అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని భద్రాచలం పట్టణం అశోక్‌నగర్‌కాలనీకి చెందిన మానస స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. సదరు యువతికి గోదావరిఖనికి చెందిన సింగరేణి ఉద్యోగి దిలీప్‌కుమార్‌తో వివాహం జరిగింది. కాగా, కొంతకాలం నుంచి అత్తింటివారు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్త దిలీప్‌కుమార్, అత్త అరుణపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా మెడికల్‌కాలనీకి చెందిన భరణి కవిత తన అత్త కనకవల్లి, మామయ్య కన్నయ్య తనను వేధింపులకు గురిచేస్తున్నారని ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కవిత భర్త భరణి శ్రీనివాస్ ఏడాది కిందట అనారోగ్యంతో మృతి చెందగా అప్పటి నుంచి అత్తమామలు వేధింపులకు గురిచేస్తున్నారని, పెద్దల సమక్షంలో ఎన్నిసార్లు చెప్పినా వినడం లేదని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని ఎస్‌ఐ విజయలక్ష్మి తెలిపారు.

గంజాయి స్వాధీనం!

భద్రాచలంఅర్బన్: ద్విచక్రవానంపై గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను స్థానిక పోలీసులు ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద ఆదివారం పట్టుకున్నట్లు సమాచారం. పట్టణంలోని బ్రిడ్జి సెంటర్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. గుంటూరుకు చెందిన ఇద్దరు యువకులు సీలేరులో 5 కేజీల గంజాయి కొనుగోలు చేసి ద్విచక్రవాహనంపై విజయవాడకు తరలిస్తుండగా వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు పట్టుబడినట్లు తెలిసింది. గంజాయి, బైక్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం.

ఎవరేం అన్నారంటే...

ప్రజల పక్షాన పోరాడే పార్టీ బీజేపీ

- మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కుంజా సత్యవతి మాట్లాడుతూ బీఆర్ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చాక ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు గోస పడుతున్నారన్నారు. సీఎం కేసీఆర్ భద్రాచలానికి రూ.100 కోట్లు ఇస్తామని చెప్పి రూపాయి కూడా ఇవ్వలేదని, వరదల సమయంలో రూ.వెయ్యి కోట్లతో ముంపు ప్రాంత ప్రజలకు ఇళ్లు కట్టిస్తామని, సాయం అందజేస్తామని చెప్పినా విస్మరించారని తెలిపారు. అదే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాత్రం ప్రకటించిన విధంగా రూ.100 కోట్లు కేటాయించడంతో దేవాలయ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు.
- కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ అవలంబించిన రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా, తెలంగాణలో బీజేపీ రావాల్సిన ఆవశ్యకత తెలియజేసేందుకే ఈ సభను నిర్వహించినట్లు తెలిపారు. అతి, అనావృష్టితో నష్టపోయిన రైతులను కేంద్ర ప్రభుత్వం ఆదుకుంటుంటే కేసీఆర్ అడ్డుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపిస్తే వారు బీఆర్‌ఎస్‌లోకి వెళ్తారని అన్నారు. ఖమ్మం జిల్లాలో బీజేపీ బలపడేలా శ్రేణులు కష్టపడాలని సూచించారు.

– ఖమ్మం మయూరిసెంటర్ / ఖమ్మం వైరారోడ్

క్లుప్తంగా...

డా.దేబల్ దేవ్‌కు 'ఆర్గానిక్' పురస్కారం



సాక్షి, హైదరాబాద్: ప్రముఖ దేశీ వరి వంగడాల పరిరక్షకుడు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ దేబల్ దేవ్‌కు ప్రతిష్టాత్మక అంతర్జాతీయ 'ఐఫోమ్ ఆసియా ఆర్గానిక్ మెడల్ ఆఫ్ ఆనర్' లభించింది. వంద దేశాల్లో సేంద్రియ వ్యవసాయదారుల సంఘాల సమాఖ్య (ఐఫోమ్) ఆర్గానిక్స్ ఆసియా విభాగం, చైనాలోని క్సిచాంగ్ కౌంటీ సంయుక్తంగా 2023వ సంవత్సరపు ఆర్గానిక్ మెడల్ ఆఫ్ ఆనర్ పురస్కారానికి డా. దేబల్ దేవ్‌ను ఎంపిక చేశాయి. వైవిధ్యభరితమైన 1,440కు పైగా అపురూపమైన భారతీయ వరి వంగడాలను సేకరించడంతో పాటు, ఒడిశాలోని తన చిన్న పరిశోధనా క్షేత్రంలో ప్రతి ఏటా సాగు చేస్తూ పరిరక్షిస్తున్న డా. దేబల్ దేవ్ దశాబ్దాలుగా నిస్వార్థ సేవ చేస్తున్నారు. అవార్డుతోపాటు 5 వేల డాలర్ల నగదుతో పాటు ప్రశంసాపత్రం ప్రదానం చేస్తారు. ప్రకృతి సేద్యానికి అనువైన ఈ వంగడాల ద్వారానే మన ఆహార సార్వభౌమత్వం నిలుస్తుందని డా. దేబల్ దేవ్ 'సాక్షి'తో అన్నారు.



గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో చేసిన విశేష సేవలకుగానూ డాక్టర్ దినకర్ రెడ్డికి హైబి హెల్త్ కేర్ కార్నివాల్ పురస్కారాన్ని అందచేస్తున్న మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ. హైదరాబాద్‌లో ఈ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది.

చేవెళ్ల డిక్లరేషన్‌పై కాంగ్రెస్ సంబురాలు

సాక్షి, హైదరాబాద్: దళిత, గిరిజనుల అభ్యున్నతే లక్ష్యంగా శనివారం చేవెళ్ల సభలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను ప్రకటించినందుకు ఆదివాసి, దళిత కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం గాంధీభవన్‌లో బాణసంచా కాల్చి మిఠాయిలు పంచారు. సంప్రదాయ నృత్యాలు చేస్తూ సంబురాలను జరుపుకొన్నారు. అనంతరం ఆదివాసి కాంగ్రెస్ పార్టీ చైర్మన్ బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ చేవెళ్లలో ప్రకటించిన డిక్లరేషన్.. రాష్ట్రంలో దళిత, ఆదివాసి, గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు.

'హాకా'కు జాతీయ నోడల్ ఏజెన్సీ హోదా

ఆంక్షలు లేకుండా దేశవ్యాప్తంగా వ్యాపారం చేసే వీలు

- కేంద్రం తరపున ఆహార ఉత్పత్తుల కొనుగోలు
- తొలుత 50 వేల టన్నుల శనగలు కేటాయించిన కేంద్రం
- వీటిని పప్పుగా మార్చి వినియోగదారులకు అందించేలా చర్యలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ హైదరాబాద్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ అసోసియేషన్ (హాకా)కు అరుదైన గుర్తింపు లభించింది. జాతీయ స్థాయి నోడల్ ఏజెన్సీగా కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో హాకా ఇకపై దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఎలాంటి ఆంక్షలు లేకుండా కేంద్ర ప్రభుత్వం తరపున వ్యాపారం చేయనుంది. ఈ హోదాతో దేశ వ్యాప్తంగా ఉన్న నాఫెడ్, నేషనల్ కో–ఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌సీసీఎఫ్) వంటి సంస్థల సరసన హాకా చేరింది.

ఫలించిన మచ్చా కృషి

హాకాకు జాతీయ స్థాయి నోడల్ ఎజెన్సీగా గుర్తింపు కోసం ఆ సంస్థ అధికారులు సుమారు ఆర్నెల్లుగా తీవ్ర ప్రయత్నాలు చేశారు. హాకా చైర్మన్ మచ్చా శ్రీనివాసరావు పలుమార్లు ఢిల్లీ వెళ్లి కేంద్ర కోఆపరేటివ్ అధికారులతో సమావేశమయ్యారు.



హాకా చైర్మన్ మచ్చా శ్రీనివాసరావు

హాకాను మరింత బలోపేతం చేసేందుకు గానూ దేశ వ్యాప్తంగా వ్యాపారం చేసే అవకాశం కల్పించాలని కోరారు. చిట్టచివరకు జాతీయ హోదా కల్పించింది. ప్రస్తుతం హాకా తెలంగాణలో రైతుల నుంచి పలు పంట ఉత్పత్తులను కొనుగోలు చేయడంతో పాటు ఇతర ప్రభుత్వ సంస్థలకు ఆహార సరుకులను సరఫరా చేసే వ్యాపారం చేస్తోంది. అంగన్‌వాడీలకు పాలు పంపిణీ చేస్తోంది. వీటిని మరింత విస్తరించి దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించింది. ఇతర రాష్ట్రాల్లోనూ ప్రభుత్వ టెండర్లలో పాల్గొనేలా, ప్రభుత్వ సంస్థలకు సరుకులు సరఫరా చేసేలా చర్యలు చేపట్టింది. హాకాకు జాతీయ నోడల్ ఏజెన్సీ దక్కడంతో ఇకపై దేశంలో ఏ రాష్ట్రంలోనైనా ఆయా ప్రభుత్వాలు వేసే టెండర్లలో పాల్గొనే అవకాశం దక్కుతుంది. తద్వారా హాకా టర్నోవర్‌తో పాటు ఆదాయం కూడా పెరగనుంది. రాబోయే రోజుల్లో దాదాపు రూ.25 వేల కోట్ల టర్నోవర్ సాధించడమే లక్ష్యంగా హాకా లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

తొలుత శనగల ప్రాజెక్టు...

జాతీయ నోడల్ ఏజెన్సీ హోదాను దక్కించుకున్న హాకాకు కేంద్ర ప్రభుత్వం తొలిసారిగా శనగల కొనుగోలు, పంపిణీ ప్రాజెక్టును ఇచ్చింది. దేశ వ్యాప్తంగా శనగపప్పు ధర అధికంగా ఉండడంతో ప్రభుత్వ పరంగా తక్కువ ధరకు వినియోగదారులకు అందించేలా కేంద్రం చేపట్టిన 'భారత్ దాల్' మిషన్‌లో భాగంగా హాకాకు శనగపప్పును సరఫరా చేసే బాధ్యతను అప్పగించింది. ప్రస్తుతం 50 వేల టన్నుల శనగలను కేటాయించింది. ఈ శనగలను వివిధ రాష్ట్రాల్లో కొనుగోలు చేసి, దాన్ని పప్పుగా మార్చాలి. ఆ పప్పును మార్కెట్లోకి విడుదల చేయాల్సిన బాధ్యత హాకాపై ఉంటుంది. అంతేకాకుండా ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే చౌక దుకాణాలకు కూడా హాకా సరఫరా చేయాల్సి ఉంటుంది. ఈ వ్యాపారం ద్వారా హాకాకు అదనంగా మరో రూ.150 కోట్ల టర్నోవర్ పెరగనుంది. తద్వారా హాకా టర్నోవర్ ఒకేసారి రెండింతలు కానుంది. ప్రస్తుతం హాకా రూ. 150 కోట్ల టర్నోవర్ కలిగి ఉంది. భవిష్యత్తులో అవసరమైతే ధాన్యం కొనుగోలు రంగంలోకి కూడా దిగాలని కూడా భావిస్తోంది.

చైర్మన్‌కు అధికారి అడ్డంకులు...

హాకా చైర్మన్‌గా మచ్చా శ్రీనివాసరావు వినూత్న చర్యలు చేపడుతున్నప్పటికీ, ఆయనకు వ్యవసాయశాఖలోని ఒక కీలకాధికారి అడ్డంకులు సృష్టిస్తున్నట్లు సమాచారం. దీంతో ఆయన ప్రభుత్వ పెద్దల వద్ద తన గోడును విన్నవించుకున్నారని తెలుస్తోంది. హాకాను ఎంతో అభివృద్ధి చేయాలని కృషి చేస్తుంటే కొంతమంది ఉద్దేశ్యపూర్వకంగా అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారని తెలిసింది. కాగా ప్రభుత్వ పెద్దలతో సత్సంబంధాలు ఉండటంతో మచ్చా అన్ని అడ్డంకులు అధిగమిస్తూ హాకాకు జాతీయ హోదా తీసుకొచ్చారని సంస్థ అధికారులు చెబుతున్నారు.

ప్రజల కోసం పనిచేసే పార్టీలను ఎన్నుకోండి

సీఎం చంద్రశేఖరరావు



సాక్షి, హైదరాబాద్: ప్రజల కోసం పనిచేసే పార్టీ, ప్రభుత్వాన్ని ఎన్నుకున్నప్పుడే ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయని భారత్ రాష్ట్ర సమితి అధినేత ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు అన్నారు. మహారాష్ట్ర బీజేపీ మైనార్టీ నేతలు పలువురు ఆదివారం ప్రగతిభవన్‌లో కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కేసీఆర్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ పూలే, అంబేడ్కర్ వంటి సంఘసంస్కర్తలు, మేధావుల స్ఫూర్తితో దేశంలో సమూల మార్పు లక్ష్యంగా ప్రజలు చైతన్యవంతులై ఉద్యమించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీకి అధికారం ఇస్తున్నా జీవితాల్లో ఎలాంటి మార్పు రాకపోవడంపై ప్రజలు, యువత ఆలోచించాలన్నారు. సోలాపూర్ నుంచి వల్యాల నగేష్ నేతృత్వంలో ముస్లిం మైనార్టీ నేతలతో పాటు బీడ్ జిల్లా నుంచి పూల్‌చంద్ కరాడ్ ఆధ్వర్యంలో, మాజీ ఎమ్మెల్యే ముల్లర్ అంకోలా నుంచి, కొల్హాపూర్ నుంచి మహారాష్ట్ర కిసాన్ సెల్ ప్రెసిడెంట్ సంజయ్ పాటిల్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మహారాష్ట్ర బీఆర్ఎస్ ఇన్‌చార్జి కల్వకుంట్ల వంశీధర్ రావు, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, మధుసూదనాచారి తదితరులు పాల్గొన్నారు.

సర్వీసులో చనిపోతే రూ.7లక్షలు

- ఎంప్లాయ్ డిపాజిటెడ్ లింక్డ్ ఇన్సూ్యరెన్స్ ఫెసిలిటీ అమలుకు ఆర్టీసీ నిర్ణయం
- ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలకు మరింత సాంత్వన
- గరిష్టంగా రూ.7 లక్షలు, కనిష్టంగా రూ.2.5 లక్షలు
- ఇప్పటికిప్పుడు 600 కుటుంబాలకు అందజేసే అవకాశం

సాక్షి, హైదరాబాద్: సర్వీసులో ఉంటూ చనిపోయే ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలకు సాంత్వన కలిగించే వార్త ఇది. భవిష్యనిధి(పీఎఫ్) ఆధారిత 'ఎంప్లాయ్ డిపాజిటెడ్ లింక్డ్ ఇన్సూ్యరెన్స్ ఫెసిలిటీ (ఈడీఎల్ఐఎఫ్)' ని వర్తింప చేసేందుకు ఆర్టీసీ శ్రీకారం చుట్టింది. ఈమేరకు తాజాగా సర్క్యులర్ జారీ చేసింది. సర్వీసులో ఉంటూ (ఈపీఎఫ్ సభ్యత్వం) చనిపోయే ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలకు గరిష్ఠంగా రూ.7 లక్షల వరకు ఆర్థిక సాయం అందుతుంది. ఇది ఉద్యోగి భవిష్య నిధికి చెల్లించే కాంట్రిబ్యూషన్‌తో సంబంధం లేకుండా, సంస్థ చెల్లించే మొత్తానికి అనుబంధంగా ఉండనుంది. దీంతో ఈ రూపంలో అందే మొత్తం ఉద్యోగి కుటుంబానికి అదనపు లబ్ధిగా ఉండనుంది.



ఇదీ పాత పథకమే కానీ..

వాస్తవానికి ఇది పాత పథకమే. భవిష్య నిధి నిబంధనల ప్రకారం ఈపీఎఫ్ సభ్యులందరికీ కచ్చితంగా అందాల్సిందే. గతంలో ఈ మొత్తం తక్కువగా ఉండేది. 2021లో కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ దీన్ని సవరించింది. కనిష్ట మొత్తాన్ని రూ.రెండున్నర లక్షలకు, గరిష్ఠ మొత్తాన్ని రూ.7 లక్షలకు పెంచింది. ఈ పెంపు 2020వ సంవత్సరం నుంచే వర్తిస్తుందని కూడా పేర్కొంది. కానీ, రకరకాల కారణాలతో ఇది ఆర్టీసీలో అమలు కాలేదు. ఏపీఎస్ఆర్టీసీకి, తెలంగాణ ఆర్టీసీకి గతంలో ఉమ్మడిగా పీఎఫ్ ట్రస్ట్ ఉండటం, ఇతర సాంకేతిక కారణాలతో ఈ సవరించిన లబ్ధి అందకుండా పోయింది. తాజాగా ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తూ ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో, ఈ లబ్ధిని అమలులోకి తేవాలంటూ కార్మిక సంఘాలు గట్టిగా డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వంలో విలీనం కంటే ముందే దీన్ని వర్తింప చేయాలని, తదుపరి వచ్చే సాంకేతిక కారణాలతో కొన్ని రకాల లబ్ధికి గండి పడే ప్రమాదం ఉందన్న ఆందోళనతో దీన్ని ముందుగానే వర్తింప చేయాలని పట్టుపట్టాయి. ఈమేరకు ప్రభుత్వానికి విన్నవించాయి. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం ఆర్టీసీ సానుకూల నిర్ణయం తీసుకుంది.

లెక్క ఎలా అంటే..

నెలవారీ సగటు వేతనంపై ఈ మొత్తాన్ని లెక్కిస్తారు. గరిష్ఠ సగటు వేతనం రూ.15 వేలుగా నిర్ధారించి దానికి 35 రెట్ల మొత్తాన్ని గుణిస్తారు. ఆపై రూ.1.75 లక్షల మొత్తాన్ని బోనస్‌గా దీనికి చేర్చి రూ.7 లక్షల మొత్తాన్ని గరిష్ఠ మొత్తంగా నిర్ధారిస్తారు. ఇది ఆ ఉద్యోగి చనిపోయే సమయానికి పీఎఫ్ ఖాతాలో ఉన్న నిల్వ ఆధారంగా గుణిస్తారు.

600 కుటుంబాలకు తక్షణ లబ్ధి..

గతంలో ఈ పథకాన్ని వర్తిస్తూ మధ్యలో నిలిపి వేశారని కార్మిక సంఘాల నేతలు చెబుతున్నారు. అలా 600 మంది ఉద్యోగుల కుటుంబాలకు కొత్తగా లబ్ధి అందకుండా పోయిందన్నారు. ఇప్పుడు ఆర్టీసీ నిర్ణయంతో ఆ 600 కుటుంబాలకు వెంటనే లబ్ధి చేకూరుతుందని, తదుపరి ఈపీఎఫ్ సభ్యులు చనిపోతే వారి కుటుంబాలకు సాయం అందుతుందని టీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీఎస్‌రావు తెలిపారు.

విమర్శలకు భయపడను

- దళితవాడలకు శ్రీవారిని తీసుకెళ్లి కళ్యాణం చేసింది.. మాడవీధుల్లో చెప్పులతో తిరగడాన్ని నిషేధించిందీ నేనే
- మతాంతీకరణలు ఆపడానికి 30 వేల మందికి కళ్యాణమస్తు ద్వారా సామూహిక వివాహాలు చేయించా
- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

సాక్షి, తిరుపతి: దళితవాడలకు శ్రీ వేంకటేశ్వరస్వామిని తీసుకెళ్లి కళ్యాణం చేసింది.. తిరుమల ఆలయ మాడవీధుల్లో చెప్పులు వేసుకుని తిరగకూడదని నిర్ణయం తీసుకుంది తానేనని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి విమర్శకులకు గట్టిగా సమాధానమిచ్చారు. తాను క్రిస్టియన్ అని, నాస్తికుడినని ఆరోపణలు చేస్తున్న వారికి ఇదే నా సమాధానమన్నారు. ఆరోపణలకు భయపడి మంచి పనులు చేయడం ఆపేవాడిని కాదని.. తాను పోరాటాల నుండి పైకొచ్చిన వాడినని, విమర్శలకు భయపడనని ఆయన స్పష్టంచేశారు. ఆదివారం తిరుపతిలో జరిగిన 'మూడుతరాల మనిషి' పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఆయనతోపాటు ఈఓ ధర్మారెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూమన మాట్లాడుతూ.. తాను 17ఏళ్ల క్రితమే టీటీడీ చైర్మన్ అయిన వ్యక్తినని గుర్తుచేశారు. దేవుడి దయతో మతాంతీకరణలు ఆపడానికి 30 వేల మందికి కళ్యాణమస్తు ద్వారా సామూహిక వివాహాలు చేయించిన విషయాన్ని ఆయన వివరించారు. తిరుమల ఆలయ నాలుగు మాడవీధుల్లో చెప్పులు వేసుకుని తిరగకూడదనే నిర్ణయం కూడా తనదేనన్నారు. అన్నమయ్య 600వ వర్ధంతి ఉత్సవాలు చేసిన విషయాల గురించి తెలిపిందీ తానేనని ఆయన వెల్లడించారు.



నాలుగేళ్ల అభివృద్ధిపై పీపీటీ ప్రదర్శన..

తిరుమల శ్రీవారిపై ఉన్న భక్తివిశ్వాసాలను దెబ్బతీసేలా సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని టీటీడీ ఈఓ ధర్మారెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. టీటీడీ నాలుగేళ్లలో చేసిన అభివృద్ధి, భక్తుల వసతుల కల్పనపై నెలరోజుల్లో పీపీటీ ప్రదర్శన ఏర్పాటుచేయనున్నట్లు ప్రకటించారు. టీటీడీ మీద విమర్శలు చేస్తున్న వారిలో తిరుపతి వాసులు కూడా ఉన్నారని తెలిపారు. టీటీడీని తిరుపతి వాసులు తమ సొంతంగా భావించాలని కోరారు. దేవుడి దయవల్లే తిరుపతిలో ప్రత్యక్షంగా పరోక్షంగా వేల మంది ఉపాధి పొందుతున్నారని, శ్రీవారివల్లే తిరుపతి ఎంతో అభివృద్ధి చెందుతోందని ఆయన స్పష్టంచేశారు.

జిల్లా వార్తలు


సింగరేణిలో ప్రోగ్రామర్ ట్రెయినీ పోస్టులకు రాతపరీక్ష



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న జీఎం బసవయ్య

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ప్రోగ్రామర్ ట్రెయినీ (ఐటీ) ఈ–1 గ్రేడ్ ఇంటర్నల్ పోస్టుల భర్తీకి ఆదివారం రాతపరీక్ష నిర్వహించారు. సింగరేణి మహిళా కళాశాలలో ఈ పరీక్ష జరగగా, నాలుగు పోస్టులకు గాను దరఖాస్తు చేసుకున్న 532 మందిలో 477 మంది హాజరయ్యారు. పరీక్ష నిర్వహణను జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష ఫలితాలను ఆదివారం రాత్రికి విడుదల చేసి, మెరిట్ జాబితాను వారంలోగా విడుదల చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు ప్రసాద్‌రావు, దీక్షితులు, రాంకుమార్‌రావు, సీహెచ్ శశిధర్‌రాజు, ధన్‌పాల్ శ్రీనివాస్, పి.వేణుగోపాల్‌రావు, రాజేందర్‌రెడ్డి, బీవీ చలపతిరావు, డి.నాగేశ్వరరావు, సంతోష్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ శారద పాల్గొన్నారు.

బీఈడీ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



గంగసాని నవీన్

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని గిరిజన సంక్షేమశాఖ బీఈడీ కళాశాల అధ్యాకుడు గంగసాని నవీన్‌కు డాక్టరేట్ లభించింది. భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యాన గిరిజన అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలపై ఆయన సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఈ సందర్భంగా నవీన్‌ను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఉద్యోగులు అభినందించారు.

సీఎంఓగా ఎవరొస్తారో?

- సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో కీలక పోస్టు ఖాళీ
- సీఎండీ చేతుల్లో నియామకం
- పోటీ పడుతున్న ముగ్గురు ఏసీఎంఓలు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ (సీఎంఓ)గా ఎవరిని నియమించనున్నారోనన్న చర్చ కార్మిక వర్గాల్లో మొదలైంది. గతంలో డైరెక్టర్ (పా) స్థాయిలోనే ఈ నియామకం జరిగేది. కానీ, కారుణ్య నియామకాలకు సంబంధించి మెడికల్ ఇన్‌వాలిడేషన్ ప్రక్రియలో కీలకంగా వ్యవహరించే సీఎంఓ పోస్ట్ తమ వారికే ఇప్పించేందుకు కొందరు ప్రజాప్రతినిధులు, నాయకులు రంగంలోకి దిగినట్లు తెలిసింది. దీంతో నియామక బాధ్యత ఈసారి సీఎండీ చేతుల్లోకి వెళ్లిందని సమాచారం. ప్రస్తుతం సీఎంఓగా విధులు నిర్వర్తిస్తున్న బీవీ రావుతో పాటు అంతకుముందు సీఎంఓగా పనిచేసిన మంతా శ్రీనివాసరావు కూడా ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. దీంతో ఆలోగా కొత్త అధికారిని నియమించాల్సి ఉంది.

అధికారులపై ఒత్తిళ్లు

సింగరేణి కార్మికుల చిరకాల వాంఛ అయిన కారుణ్య నియమకాల ప్రక్రియలో సీఎంఓ కీలకంగా వ్యవహరిస్తారు. తద్వారా అధికారి తమ వాడైతే ఇన్‌వాలిడేషన్ ప్రక్రియ సులువుగా చేయించుకోవచ్చని కొందరు నాయకులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ముగ్గురు ఏసీఎంఓలు ఈ పదవికి పోటీ పడుతుండగా ఒకరిపై ఆరోపణలు ఉండటంతో త్వరగా పూర్తిచేయాలని కార్పొరేట్ కార్యాలయంలోని అధికారిపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తెలిసింది. గతంలో ఈ ముగ్గురిలో ఒకరు కొన్ని అంశాల్లో బాహాటంగా వసూళ్లకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉండగా గతంలో పక్కకు పెట్టారు. మళ్లీ సదరు అధికారి సీఎంఓ కావాలనే పట్టుదలతో నేతలతో పైరవీలు చేయిస్తున్నట్లు సమాచారం.



సింగరేణి ఆస్పత్రి ముఖద్వారం

మెడికల్ ఇన్‌వాలిడేషన్‌కు రూ.లక్షల్లో వసూళ్లు

సింగరేణి సంస్థలో పనిచేసిన కార్మికుడు అనారోగ్యం నేపథ్యాన తన రెండేళ్ల సర్వీస్ వదులుకుని దరఖాస్తు చేసుకుంటే మెడికల్ బోర్డ్‌లో అన్‌ఫిట్ అయితే ఆయన కుటుంబంలో ఒకరికి ఉద్యోగావకాశం కల్పిస్తారు. అయితే, కార్మికుడు విధులు నిర్వర్తించలేని స్థితి ఉంటేనే ఇది సాధ్యమవుతుంది. కానీ కొందరు ఆరోగ్యం బాగానే ఉన్నా చిన్నచిన్న కారణాలతో మెడికల్ ఇన్‌వాలిడేషన్ చేయించుకునేందుకు తప్పుడు మార్గాలు అవలంబిస్తున్నారు. అయితే, డైరెక్టర్లు ఇచ్చిన నివేదికను చివరగా సీఎంఓ ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యాన పలువురు నాయకులు రంగంలోకి దిగి మెడికల్ ఇన్‌వాలిడేషన్ కోసం ఒక్కో కార్మికుడి నుంచి రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు వసూలు చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యాన సీఎంఓ పోస్టుకు డిమాండ్ ఉండడంతో పలువురు ప్రజాప్రతినిధులు తమకు అనుకూలమైన అధికారికి పోస్ట్ ఇప్పించేందుకు రంగంలోకి దిగారు. అయితే, సీఎండీ చేతుల్లో నియామక బాధ్యత ఉన్నందున ఎవరికి పదవి కట్టబెడతారో 31వ తేదీలోగా తేలనుంది.

రాష్ట్రంలోని నాలుగు జోన్లలో అయ్యప్ప మహాసంఘం




సమావేశంలో మాట్లాడుతున్న తిరుమల్‌రావు

ఖమ్మంఅర్బన్: అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ ఆధ్వర్యాన రాష్ట్రంలోని నాలుగు జోన్లలో అయ్యప్ప మహాసంఘం ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు వేచి తిరుమల్‌రావు వెల్లడించారు. ఖమ్మం గోపాలపురంలో ఆదివారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశాల్లో తెలంగాణ నుంచి పలువురు జాతీయ కార్యవర్గంలోకి ఎన్నికయ్యారని తెలిపారు. రానున్న మాలధారణ సీజన్‌లో తెలంగాణలోని నాలుగు జోన్లలో మహా సంఘం ఏర్పాటు చేసి కార్యకలాపాలు విస్తృతపర్చనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి పుల్లంరాజు మాట్లాడగా జిల్లా అధ్యక్షుడు కాటేపల్లి రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ నిర్ణయమే శిరోధార్యం

వైరా ఎమ్మెల్యే రాములునాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాములునాయక్

జూలూరుపాడు: బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ నిర్ణయమే ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులకు శిరోధార్యమని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ తెలిపారు. జూలూరుపాడులోని క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే టికెట్ రాలేదనే బాధలేదని, సీఎం కేసీఆర్ ప్రకటించిన మదన్‌లాల్ గెలుపునకు కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో కలిసి కృషి చేస్తానని తెలిపారు. కేసీఆర్ నిర్ణయాన్ని అందరూ గౌరవిస్తూ బీఆర్ఎస్ బలోపేతానికి సైనికుల్లా పనిచేయాలన్నారు. తెలంగాణలో పరుగులు తీస్తున్న అభివృద్ధి ఆగొద్దంటే కేసీఆర్ మూడోసారి సీఎం కావాలని చెప్పారు. అనంతరం కొమ్ముగూడెం నుంచి వైకుంఠ ధామానికి వెళ్లే రహదారిని పరిశీలించి రూ.30 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ లావుడ్యా సోనీ, జెడ్పీటీసీ భూక్యా కళావతి, లకావత్ గిరిబాబు, ఎల్లంకి సత్యనారాయణ, ఎడ్లపల్లి వీరభద్రం, వేల్పుల నరసింహారావు, పొన్నెకంటి సతీశ్‌కుమార్, నున్నా రంగారావు, చౌడం నరసింహారావు, రామిశెట్టి రాంబాబు, నాగేశ్వరరావు, కొదుమూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏళ్లు గడుస్తున్నా చిన్నచూపే!

- అభివృద్ధికి ఆమడదూరంలో ఇల్లెందు నియోజకవర్గం
- ఇకనైనా పాలకులు స్పందించాలని ప్రజల వేడుకోలు
- నేడు ఇల్లెందులో మంత్రి పువ్వాడ అజయ్ పర్యటన



ఇల్లెందులోని యువజన శిక్షణ కేంద్రం

ఇల్లెందురూరల్: ఇల్లెందు నియోజకవర్గంలోనే అతిపెద్ద మండలం ఇల్లెందు. దక్షిణ భారత దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణికి పుట్టినిల్లు. అంతటి చారిత్రక నేపథ్యం కలిగిన ఇల్లెందు మండలం సౌకర్యాల పరంగా చిన్నచూపునకు గురవుతోంది. స్వరాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమంలో కొంత మెరుగైనా ప్రధాన సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. సాగునీటి వనరులు, గిడ్డంగులు, ఉన్నత, సాంకేతిక విద్యాసంస్థలు.. ఇలా అనేకం ఇల్లెందు మండలానికి కలగానే మిగిలిపోతున్నాయి. ఇల్లెందు ప్రజల చిరకాల స్వప్నమైన బస్‌డిపోను సాకారం చేసిన రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, పట్టుబట్టి సాధించిన ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ సోమవారం డిపో ప్రారంభోత్సవానికి వస్తున్న నేపథ్యాన దశాబ్దాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై దృష్టి సారించి పరిష్కారం చూపాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈమేరకు అంశాల వారీగా సమస్యల వివరాలిలా ఉన్నాయి.

- ఇల్లెందు పట్టణానికి అతి సమీపంలో నిర్మించిన యువజన శిక్షణ కేంద్రం నిర్దేశిత లక్ష్యాన్ని అందుకోలేకపోతోంది. శిక్షణ కేంద్రాన్ని ప్రైవేట్ సంస్థకు అప్పగించడంతో అక్రమాలకు నెలవుగా మారింది. యువతకు నామమాత్రపు ఉపాధి చూపుతూ మోసం చేస్తున్నారు. వైటీసీ నిర్వహణ బాధ్యతను ఐటీడీఏకు పూర్తిస్థాయిలో అప్పగించి తమకు ఉపాధి కల్పించాలని యువత కోరుతోంది.
- మండల వ్యాప్తంగా 15వేల ఎకరాల్లో వరి, మొక్కజొన్న, పత్తి పంటలు పండిస్తుండగా, ఒక్క గోదాం కూడా నిర్మించలేదు. దీంతో పంటను మద్దతు ధరతో నిమిత్తం లేకుండా దళారులు అడిగిన ధరకు విక్రయించుకోవాల్సిన దుస్థితి రైతులకు ఎదురవుతోంది. మండలంలో కనీసం మూడు వ్యవసాయ గోదాములు నిర్మించి తమకు మేలు చేకూర్చాలని వారు కోరుతున్నారు.
- మండలంలోని చల్లసముద్రం క్యాంపు సెంటర్ నుంచి ఆంజనేయపురానికి రూ.3.5 కోట్ల వ్యయంతో మంజూరైన బీటీ రోడ్డు పనులు ఐదేళ్లుగా కొనసాగుతున్నాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఈ పరిస్థితి నెలకొనగా.. ఆప్రాంత ప్రజలు రవాణా సౌకర్యం సరిగా లేక ఇబ్బంది పడుతున్నారు. తక్షణమే స్పందించి అసంపూర్తి రహదారిని వెంటనే పూర్తి చేయించాలని అక్కడి ప్రజలు విన్నవిస్తున్నారు.
- మండలంలో కనీసం వంద ఎకరాల స్థాయిలో సాగునీటి ప్రాజెక్టు లేకపోవడంతో అత్యధికంగా పంటలు వర్షాధారంగానే సాగవుతున్నాయి. చల్లసముద్రం పెద్ద చెరువు గత పదేళ్లలో మూడుసార్లే అలుగు పోసిందంటే నీటివనరుల పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వం స్పందించి సీతారామ ప్రాజెక్టును ఇల్లెందు మండలంలో అత్యధిక విస్తీర్ణంలో ప్రవహించేలా చేయాలి. ప్రధాన వాగులైన మస్సివాగు, ముర్రేడు వాగు, చలివాగులపై రైతుల అవసరానికి అనుగుణంగా చెక్‌డ్యాంలు నిర్మిస్తే భూగర్భ జలాలు పెరిగి కనీసం బోర్ల ద్వారానైనా పంటలు పండించుకునే అవకాశం ఉంటుంది.
- ఇల్లెందు ఏజెన్సీ నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులు పదుల సంఖ్యలో ఉన్నారు. మండలంలోని కొల్లాపురం గ్రామం నుంచి వాలీబాల్ క్రీడల్లో రాణించి అనేక మంది ఉద్యోగాలు సాధించారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని ఏజెన్సీ మండలాలకు కేంద్రంగా ఉన్న ఇల్లెందులో స్పోర్ట్స్ స్కూల్‌ను మంజూరు చేయిస్తే మంచి ఫలితాలు వస్తాయి.
- సింగరేణికి పుట్టినిల్లైన ఇల్లెందులో ఆ సంస్థ ప్రయాణం వందేళ్లకు పైగా కొనసాగింది. వేల సంఖ్యలో కార్మికులు సంస్థకు సేవలందించారు. కానీ సింగరేణి సంస్థ తనకు వచ్చిన లాభాలతో ఇతర ప్రాంతాల్లో సాంకేతిక, ఉన్నత విద్యా సంస్థలను నెలకొల్పుతోంది. ప్రస్తుతం పుట్టినింట చరమాంకంలో ఉన్న సింగరేణి సంస్థ తీపిగుర్తుగా ఒక సాంకేతిక విద్యాసంస్థను ఇల్లెందులో నెలకొల్పాలని యువత కోరుతోంది.
- మండలానికి మైనార్టీ, సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల గురుకులాలను మంజూరు చేసినా అనువుగా అద్దె భవనాలు లేకపోవడంతో కారేపల్లి, ఖమ్మంలో నిర్వహిస్తున్నారు. మైనార్టీ గురుకులం మాత్రమే సింగరేణి ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్నారు. ఇంతేకాకుండా గిరిజన మహిళా డిగ్రీ కళాశాలను గతంలో ఇల్లెందుకు మంజూరు చేసినా అశ్వారావుపేట నియోజకవర్గానికి తరలించారు. ఇలా విద్యాసంస్థలు ఒక్కొక్కటి దూరమవడంతో తమకు అన్యాయం జరుగుతున్నందున తరలిపోయిన విద్యాసంస్థలను తిరిగి ఇల్లెందుకు మంజూరు చేయించాలని విద్యార్థులు కోరుతున్నారు.
- పట్టణంలోని గోవింద్‌సెంటర్‌లో రెండు గురుకులాలు ఏర్పాటు చేసేందుకు అనువుగా ఉన్న విలువైన స్థలాన్ని అటవీశాఖకు అప్పగిస్తున్నారు. సుమారు 18 ఎకరాల ఈ స్థలం ప్రస్తుతం రెవెన్యూ శాఖ ఆధీనంలో ఉంది. అటవీశాఖ కార్యాలయానికి పోను ఇంకా పది ఎకరాలైనా ఖాళీగా ఉంటుంది. ఈ స్థలాన్ని గురుకులాలకు కేటాయిస్తే విద్యాప్రగతికి దోహదపడుతుందని మండల ప్రజలు కోరుతున్నారు.

ఉద్యోగుల సిల్వర్ జూబ్లీ వేడుకలు

అశ్వాపురం: మణుగూరు భారజల కర్మాగారంలో 1998లో విధుల్లో చేరిన సుమారు 60 మంది వివిధ రాష్ట్రాల ఉద్యోగులకు 25 ఏళ్ల సర్వీస్ పూర్తయింది. ఈ సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని గౌతమీ నగర్‌కాలనీలో వారి కుటుంబ సభ్యులతో కలిసి సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకున్నారు. ఎక్కడెక్కడి నుంచో ఉద్యోగాల రీత్యా వచ్చిన వారు తమ అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో బేతి రమేశ్, డీవై స్వామి, రాధాకృష్ణ, వినయ్‌సాగర్, ఏఎస్ రావు, బగేల్, రాంబాబు, మోహన్‌బాబు, సముద్రాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో ఉద్యోగులు, వారి కుటుంబీకులు